ఆంధ్రజ్యోతి

5 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
సోమవారం 22 ఏప్రిల్ 2024






తోటపల్లి పరిధిలోని ఎడమ కాలువపై శిథిలావస్థకు చేరిన వంతెన



తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు



అంతన్నారు.. ఇంతన్నారు!

- తోటపల్లి ప్రాజెక్ట్‌పై సీఎం జగన్‌వి ఒట్టి మాటలే..
- అధికారంలోకి వస్తే అధిక ప్రాధాన్యం ఇస్తామని గత ఎన్నికల్లో హామీ
- పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత ప్రాజెక్ట్‌పై తీవ్ర నిర్లక్ష్యం
- నిర్వహణ నిధులు కూడా సక్రమంగా కేటాయించని వైనం
- ఐదేళ్ల కాలంలో ఆధునికీకరణ పనులు పది శాతమే..
- రూ. కోట్లలో బిల్లుల బకాయిలు ● ఎత్తిపోతల పథకాలపైనా అలసత్వం
- గత టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు వెనక్కి మళ్లింపు
- వాటికి సంబంధించి జీవోను రద్దు చేసిన వైసీపీ సర్కారు
- ప్రభుత్వ తీరుతో.. ఏటా రైతులకు తప్పని సాగునీటి కష్టాలు

(గరుగుబిల్లి)

'పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల అపర భగీరథి.. ఉత్తరాంధ్రకే తలమానికంగా నిలిచే భారీ సాగునీటి ప్రాజెక్టు తోటపల్లికి అధిక ప్రాధాన్యం ఇస్తాం.. ప్రాజెక్టు ఆధునికీకరణతో పాటు ఎత్తిపోతల పథకాల పనులు పూర్తి చేస్తాం. శివారు భూములకు సాగునీరందిస్తాం.. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం' అని గత ఎన్నికల సమయంలో సీఎం జగన్ హామీలిచ్చారు. అయితే వాస్తవ పరిస్థితిని చూస్తే.. ఐదేళ్ల పాలనలో వాటిల్లో ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. పైగా తోటపల్లిపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆధునికీకరణ, ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేయక పోగా.. అంతంత మాత్రంగానే నిధులు కేటాయించారు. దీంతో ప్రాజెక్ట్ నిర్వహణ గాడి తప్పింది. ప్రధాన కాలువలు అధ్వానంగా మారాయి. మరోవైపు ఏటా రైతులు సాగునీటికి కటకట లాడాల్సిన పరిస్థితి. శివారు ప్రాంత రైతులు వరుణుడిపై ఆధారపడి సాగు చేపట్టాల్సి వస్తోంది. మరోవైపు తోటపల్లి నుంచి పార్వతీపురం పట్టణ వాసులకు సక్రమంగా తాగునీరు కూడా అందడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా దీనిపై నోరు మెదపకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. తోటపల్లిపై సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ.. నీటి మూట లేనా? అంటూ ప్రశ్నిస్తున్నారు. సర్కారు తీరుపై మండిపడుతున్నారు. రైతు ప్రభుత్వం అంటే ఇదేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జాతికి అంకితమిచ్చిన చంద్రబాబు

జిల్లాలో గరుగుబిల్లి మండలం తోటపల్లిలోని నాగావళి నదిపై బ్రిటిష్ వారు 1908లో రెగ్యులేటర్ నిర్మించారు. అయితే టీడీపీ ప్రభుత్వ హయాంలో తోటపల్లికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. 2003లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. రూ.450.23 కోట్లతో ఆధునికీకరణ పనులు ప్రారంభిం చారు. 1,95,221 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు 2015 సెప్టెంబరు 10న ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు జాతికి అంకితం చేశారు. ప్రస్తుతం విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలో తోటపల్లి కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా లక్షా 85 వేల ఎకరాలకు సాగునీరందుతుంది.

వైసీపీ పాలనలో ఆధునికీకరణపై నీలినీడలు

తోటపల్లి ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువకు అనుసరించి ఉన్న పాత రెగ్యులేటర్‌కు సంబంధించి టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 193 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు 33 శాతం మేర పనులను నిర్వహించారు. అయితే ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. ఆధునికీకరణ పనులకు ఆటంకం నెలకొంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో మేజర్ పనులేవీ పూర్తికాలేదు. ఇప్పటివరకు కేవలం పది శాతం పనులే పూర్తయ్యాయి. మరోవైపు కాంట్రాక్టర్లకు సుమారు రూ. 18 కోట్ల వరకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులను అర్థాంతరంగా నిలిచిపోయాయి. మొత్తగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రానున్న ఖరీఫ్‌లో సుమారు రెండు కాలువల పరిధిలోని లక్ష ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది.

అసంపూర్తిగానే లైనింగ్ పనులు

ప్రాజెక్టు నుంచి అధికంగా వరద ప్రవాహం వస్తే కుడి, ఎడమ గట్లు కోతకు గురికాకుండా లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులకు సుమారు రూ.100 కోట్లు కేటాయించారు. నిధులు మంజూరవుతాయన్న ఆశతో అధికారులు పనుల నిర్వహణ బాధ్యతలను సంబంధిత కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే చేసిన పనులకు చెల్లింపులు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆ పనులను మధ్యలోనే నిలుపుదల చేశారు. నిధులు మంజూరు కాకపోవడంతో అప్పటివరకు చేసిన పనులు మూడు దఫాలు నీటిలో కొట్టుకుపోయాయి. మరోవైపు ముఖ్యమంత్రి జగన్ ఏటా బడ్జెట్‌లో తోటపల్లికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు. ప్రాజెక్ట్ నిర్వహణకు కూడా పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదు. మొత్తంగా వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతులు సాగునీటికి ఎదురు చూపులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పర్యాటక కేంద్రంపై కన్నెత్తి చూడని సర్కారు..

తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టుకు ఆనుకుని ఉన్న కుడి మట్టికట్ట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని గత టీడీపీ ప్రభుత్వం భావించింది. ఈ మేరకు పర్యాటకులకు అనుగుణంగా ఉండేందుకు బోటు షికారు, పార్కును ఏర్పాటు చేశారు. దీంతో ప్రాజెక్టు పరిధిలోని గిరిజనులు జీవనోపాధి పొందేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తోటపల్లి పర్యాటకంపై శీతకన్ను వేసింది. తోటపల్లిని పూర్తిస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్న సీఎం జగన్ హామీ గాలిలో కలిసిపోయింది. బోటు షికారు, పార్కు నిర్వహణపై నిర్లక్ష్యం వహించారు. అదే విధంగా ఆ ప్రాంతంలో నదిలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపునకు కూడా నిధులు కేటాయించ లేదు. దీంతో తోటపల్లి పర్యాటకంగా కళ తప్పింది. సందర్శకుల రాక తగ్గింది. ప్రస్తుతం బోటు షికారును నిలిపేశారు. పార్కును నామమాత్రంగానే నిర్వహిస్తున్నారు. మరోవైపు ప్రాజెక్టు పరిధిలోని గిరిజన కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని జగన్ హామీ ఇచ్చినా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో వారంతా రోడ్డున పడ్డారు.

వంతెన నిర్మాణ హామీ.. గాలిలో..

తోటపల్లి పాత బ్యారేజీ పరిధిలో ఎడమ ప్రధాన కాలువకు అనుసరించి బ్రిటిష్ హయాంలో నిర్మించిన వంతెన ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఏ క్షణాన కూలుతుందో తెలియని పరిస్థితి. వంతెనకు ఆనుకుని ఉన్న రక్షణ గోడలు బీటలుదేరి ప్రమాదాలకు నిలయంగా మారాయి. అయితే ముఖ్యమంత్రి హోదాలో కురుపాం బహిరంగ సమావేశానికి వచ్చిన జగన్.. బ్యారేజీ పరిధిలోని వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కురుపాం నుంచి వెళ్లగానే ఈ సమస్యను పక్కన పెట్టారు. ఈ మార్గంలోనే ప్రస్తుత కురుపాం ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి రాకపోకలు సాగిస్తున్నప్పటికీ వంతెన గురించి పట్టించుకోవడం లేదు. అసలు దాని నిర్మాణంపై గాని నోరుమెదపని పరిస్థితి. దీంతో నిత్యం ఈ ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఏ మాత్రం వంతెన కూలినా.. కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాలతో పాటు ఒడిశా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోనున్నాయి. దీంతో ఆయా ప్రాంతవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వంతెన నిర్మాణంపై సీఎం జగన్ హామీ ఏమైందని వారు ప్రశ్నిస్తున్నారు.

ఎత్తిపోతలపై ఇలా..

తోటపల్లి ప్రాజెక్టు పరిధి ఎడమ ప్రధాన కాలువ ప్రాంతంలో మూడు ఎత్తిపోతల పథకాల నుంచి మూడు మండలాలకు సాగునీరు అందిచాలని గత టీడీపీ ప్రభుత్వం భావించింది. ఈ మేరకు బ్యారేజీకి అనుసంధానంగా వాటి ఏర్పాటుకు గాను రూ. 44.03 కోట్లు మంజూరు చేశారు. ఎడమ కాలువకు ఆనుకుని ఉన్న ప్రాంతం నుంచి నాగూరు ఎత్తిపోతల ద్వారా 2,625 ఎకరాలకు, తోటపల్లి బ్యారేజీ జల విస్తరణ ప్రాంతం నుంచి 2,649 ఎకరాలకు, జియ్యమ్మవలస మండలం చింతలబెలగాం నుంచి 2,726 ఎకరాలకు.. ఇలా మొత్తంగా 8 వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. మూడు ఎత్తిపోతల పథకాలకు హైడ్రాలాజికల్ క్లియరెన్స్‌తో పాటు ఆర్థికశాఖ అనుమతులు మంజూరయ్యాయి. టీడీపీ ప్రభుత్వం ఆఖరు సమయంలో అప్పటి సీఎం చంద్రబాబు తోటపల్లి ప్రాంతంలోని రైతుల సమస్యలను గుర్తించి పరిపాలన అనుమతులు మంజూరు చేయించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తోటపల్లిపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిధులు ఉన్నా మంజూరుకు చొరవ చూపలేదు. దీంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో మూడు ఎత్తిపోతల పథకాలకు మంజూరైన రూ. 44.03 కోట్లు వెనక్కి మళ్లాయి. ఆ నిధులకు సంబంధించి ఇచ్చిన జీవోను రద్దు చేయించింది. వైసీపీ హయాంలో ఎత్తిపోతల పథకాలకు మంగళం పాడింది. జగన్‌రెడ్డి సాగునీటికు ఇచ్చిన హామీలు గాలిలోనే కలిశాయి. గతంలో ఇచ్చిన హామీలు నేటికి ఒక్కటి కూడా నిలబెట్టుకోలేదు.



నందివానివలస తోటపల్లి ఎడమ కాలువ పరిధిలో ఎత్తిపోతల పథకం ప్రారంభించాల్సిన ప్రాంతం ఇదే..

ఏటా ఇబ్బందులు..

తోటపల్లికి ఆనుకుని నాకు నాలుగైదు ఎకరాల భూమి ఉంది. కానీ సాగునీరు అందడం లేదు. ఏటా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తోటపల్లికి ప్రత్యేక ప్రాధాన్యంతో పాటు రైతుల సమస్యలను పరిష్కరించేవారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టులు, రైతులను పట్టించుకోని దుస్థితి ఏర్పడింది. మా సమస్యలపై పలు దఫాలు నిలదీసినా ప్రజాప్రతినిధుల్లో మార్పు రాలేదు. తోటపల్లి ప్రాణం పోసింది చంద్రబాబు అయితే.. రైతుల ఉసురు పోసుకుంది మాత్రం సీఎం జగన్.

-పి.రాంబాబు, చినకొదమ, జియ్యమ్మవలస మండలం

సర్కారు నిర్లక్ష్యం..

తోటపల్లి పరిధిలో ఎత్తిపోతల పథకం నుంచి సుమారు ఎనిమిది వేల ఎకరాలకు పైగా సాగునీరు అందిం చేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. గత టీడీపీ ప్రభుత్వం కాలంలో మంజూరైన నిధులకు సంబంధించి జీవోలను రద్దు చేసింది. పనులు నిర్వహించకుండా ఆటంకం కల్పించారు. వైసీపీ సర్కారు తీరుతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది.

-అంబటి తవిటినాయుడు, సర్పంచ్, సంతోషపురం

నిధులు మంజూరులో జాప్యం..

నిధులు మంజూరులో తీవ్ర జాప్యంతోనే పనులు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. తోటపల్లి ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు 33 శాతం మేర జరిగాయి. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు కాకపోవడంతో పనులు అర్థాంతరంగా నిలిచాయి. ప్రాజెక్టు పరిధిలోని పలు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-డి.రవికుమార్, డీఈఈ, పాలకొండ

అభ్యర్థులకు బీ ఫారాలు

- అందజేసిన టీడీపీ అధినేత చంద్రబాబు
- విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు



టీడీపీ అధినేత చంద్రబాబు చేతుల మీదుగా బీ ఫారాలు అందుకున్న సంధ్యారాణి, విజయచంద్ర, జగదీశ్వరి తదితరులు

పార్వతీపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి)/ గుమ్మలక్ష్మీపురం/ కురుపాం/కొమరాడ: జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో టీడీపీ తరపున ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు బీ ఫారాలు అందించారు. పార్టీ గెలుపు కోసం నేతలంతా సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోజక వర్గాల అభ్యర్థులు బోనెల విజయచంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, తోయక జగదీశ్వరి ఆదివారం అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నారు. వారికి టీడీపీ అధినేత చంద్రబాబు బీ ఫారాలు అందజేసి .. ఎన్నికల్లో అనుసంచారించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ప్రచారాలను ముమ్మ రం చేయాలని సూచించారు. వైసీపీ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిఒక్కరూ ఓటు వేసేలా చూడాలని తెలిపారు. అభ్యర్థులంతా విజయమే లక్ష్యంగా పనిచేయాలని, ఎమ్మెల్యేగా గెలిచి రావాలని ఆశీర్వదించారు. అనంతరం అరకు పార్లమెంట్ పరిధిలో పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థులు గిడ్డి ఈశ్వరి(పాడేరు), మిరియాల శిరీష (రంపచోడవరం)కు చంద్రబాబు బీ ఫారాలను అందించారు. ముందుగా అభ్యర్థులతో ప్రమాణస్వీకారం చేయించారు. నామినేషన్ పత్రాల సమర్పణ, నింపే విధానం, డాక్యుమెంట్లు, అఫిడవిట్లు జత చేయడం తదితర అంశాలపై అభ్యర్థులకు వివరించారు.

నేడు కురుపాం అభ్యర్థి నామినేషన్

కురుపాం నియోజకవర్గం నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన తోయక జగదీశ్వరి సోమవారం నామినేషన్ వేయనున్నారు. ఉదయం 10 గంటలకు ఆర్వో కార్యాలయంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేయన్నారు. ఇందుకు సంబంధించి శ్రేణులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఇప్పటికే బీజేపీ, జనసేన పార్టీ నాయకులతో టీడీపీ నాయకులు సమావేశాలను ఏర్పాటు చేసి జన సమీకరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్‌చంద్రదేవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ డి.రామకృష్ణ, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్ష్మణరావు, తెలుగు రైతు రాష్ట్ర నాయకులు, గరుగుబిల్లి, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలసకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనున్నారు.

అరకు ఎంపీ అభ్యర్థి కూడా..

అరకు పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్డీఏ తరపున ఎన్నికల బరిలో నిలిచిన మాజీ ఎంపీ కొత్తపల్లి గీత సోమవారం నామినేషన్ వేయనున్నారు. కలెక్టరేట్‌లో ఆమె నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు. తొలుత జిల్లా కేంద్రం పార్వతీపురంలో నిర్వహించనున్న ర్యాలీలో ఆమె పాల్గొనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర రూరల్ డెవలప్‌మెంట్ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే హాజరుకానున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

పొదల్లోకి ఆర్టీసీ బస్సు



భామిని: భామిని మండలంలో ఓ ఆర్టీసీ బస్సు పొదల్లోకి దూసుకెళ్లింది. అయితే డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం మధ్యాహ్నం బత్తిలి నుంచి శ్రీకాకుళం వైపు ఆర్టీసీ బస్సు బయల్దేరింది. సుమారు 15 కిలోమీటర్లు దాటాక డ్రైవర్ అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆయన తన ఆరోగ్య పరిస్థితిని కండక్టర్‌కు చెప్పారు. దీంతో రోడ్డు పక్కకు బస్సును నిలిపేశారు. అందులో ఉన్న 18 మంది ప్రయాణికులను దించారు. వారిని వేరే బస్సుకు ఎక్కించాలనుకున్నారు. అయితే ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా బస్సును రోడ్డుకు మరింత సైడుగా తీయాలని డ్రైవర్ ప్రయత్నించారు. ఇదే సమయంలో ఆయన అపస్మారక స్థితికి చేరడంతో బస్సు అదుపు తప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. వెంటనే డ్రైవర్‌ను బస్సు నుంచి దించి బైక్ ద్వారా ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న భామిని పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. ఆయన వడదెబ్బకు గురైనట్టు గుర్తించి వైద్యులు గుర్తించి చికిత్స అదించారు.

ఐదేళ్లయినా.. ఇంతేనా?

- కలగా భోరిగెడ్డపై వంతెన నిర్మాణం
- గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే
- నేటికీ నెరవేర్చని వైనం
- గిరిజనులకు తప్పని ఇబ్బందులు
- ఇంటింటికీ చందాలేసుకుని.. కర్రలతో బ్రిడ్జీ ఏర్పాటు చేసుకున్న రెండు గ్రామాల ప్రజలు
- అయినా స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు



భోరిగెడ్డపై గిరిజనులు ఏర్పాటు చేసిన కర్రల వంతెన

(కురుపాం రూరల్)

ఈ వంతెనపై రాకపోకలు చూసి.. ఇదేదో మారుమూల గిరిజన గ్రామం అనుకునేరు. ఇది కురుపాం మండల కేంద్రానికి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోనే ఉన్న గొటివాడ పంచాయతీలో పరిస్థితి. ఏళ్లు గడుస్తున్నా.. దీనిపై పట్టించుకునే వారే కరువయ్యారు. మొత్తంగా ఆ పంచాయతీ పరిధిలోని భోరి గెడ్డపై వంతెన నిర్మాణం కలగా మారింది. ఈ గెడ్డపై వంతెన నిర్మాణం చేపడతామని గత ఎన్నికల సమయంలో కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి హామీ ఇచ్చారు. అయితే ఐదేళ్లు గడిచినా.. ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వాస్తవంగా గొటివాడ నుంచి భోరి, బండిగూడ గ్రామాలకు వెళ్లాలంటే ఈ భోరిగెడ్డ దాటాల్సిందే. అయితే దానిపై బ్రిడ్జి లేకపోవడంతో వర్షాలు కురిసే సమయంలో ఆయా గ్రామస్థులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతున్నాయి. రోజుల తరబడి గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో వారంతా ఇళ్లకే పరిమితమవ్వాల్సి వస్తోంది. గొటివాడలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యం పక్క గ్రామాల నుంచి 20 మంది వరకూ పిల్లలు వస్తుంటారు. అయితే గెడ్డ ఉప్పొంగినప్పుడు వీరి బాధలు వర్ణణాతీతం. గతంలో పిల్లలు పీకల్లోతు నీటిలో గెడ్డను దాటి స్కూలుకు వెళ్లిన దృశ్యాలు సోషన్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో వంతెన నిర్మాణానానికి నిధులు మంజూరు చేస్తామంటూ అప్పట్లో చెప్పిన ప్రజా ప్రతి నిధులు, అధికారులు ప్రకటనలకే పరిమితమయ్యారు. మరోవైపు గెడ్డకు అవతల వైపు ఉన్న భోరి, బండిగూడ గ్రామాలకు చెందిన 60 కుటుంబాల గిరిజనులు ఇంటికి రూ.1500 చొప్పున పోగేసుకుని భోరిగెడ్డపై కర్రలతో వంతెన నిర్మించుకుని రాకపోకలు సాగిస్తున్నారు. దానిపై ప్రయాణిం చడం కూడా ప్రమాదమే అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితు ల్లోనే ఇలా చేయాల్సి వచ్చిందని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. అయితే వరదల కారణంగా ప్రతి రెండేళ్లకు కర్రలతో వంతెనను పునర్నిర్మించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

గతంలో భోరిగెడ్డ దాటే సందర్భాల్లో ముగ్గురు వ్యక్తులు మరణించారు. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. గెడ్డపై వంతెన నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నాం.

- తిమ్మక ధర్మారావు, గొటివాడ

నిర్మిస్తే ఎంతో ఉపయోగకరం

భోరిగెడ్డపై వంతెన నిర్మిస్తే మూడు గ్రామాల పరిధిలోని 200 గిరిజన కుటుంబాలకు ఉపయుక్తంగా ఉంటుంది. అటవీ ఫలసాయాలను మార్కెట్‌కు తరలించే వీలుంటుంది.

- సుందర్రావు, గొటివాడ

ఏ-ఫారం.. బీ-ఫారం అంటే..

కొమరాడ: సార్వత్రిక ఎన్నికల నగారా మోగి నెల రోజులు కావస్తోంది. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల సమయంలో ఎ-ఫారం, బీ-ఫారం అనే పదాలు తరచూ వింటుంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ లేదా జాతీయ రాజకీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు బీ-ఫారాన్ని ఇస్తాయి. అంటే ఫలానా నియోజకవర్గం నుంచి తమ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థి ఇతనే అని ఇచ్చే ధ్రువీకరణ పత్రమే ఇది. ఈ ఫారాన్ని పార్టీ అధ్యక్షుడు గానీ.. ఆ పార్టీకి చెందిన ప్రత్యేక ప్రతినిధి గానీ అభ్యర్థులకు అందిస్తారు. నామినేషన్ వేసే సమయంలో రిటర్నింగ్ అధికారికి అవసరమైన ధ్రువపత్రాలతో పాటు బీ-ఫారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఇలా బీ-ఫారాన్ని సమర్పించిన అభ్యర్థులకే ఎన్నికల కమిషన్ ఆ పార్టీ గుర్తును కేటాయిస్తుంది. లేకపోతే అతడిని స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తుంది. పార్టీ అధ్యక్షుడు లేదా పార్టీ నియమించిన ప్రత్యేక ప్రతినిధి అభ్యర్థులకు బీ-ఫారాలు అందిస్తారు. ఆ అధికారాన్ని ఆయనకు అప్పగిస్తూ ఇచ్చేదే ఎ-ఫారం. దీనిని తీసుకున్న వ్యక్తికే అభ్యర్థులకు బి-ఫారం ఇచ్చే అధికారం ఉంటుంది. ఫారాన్ని తీసుకున్న వ్యక్తి దానిని ఎన్నికల అధికారికి సమర్పించి తానే బీ-ఫారాన్ని ఇచ్చినట్లు స్పష్టం చేయాల్సి ఉంటుంది.

పీపుల్స్ మేనిఫెస్టో

లారీ పరిశ్రమను ఆదుకోవాలి



సాలూరు రూరల్: సాలూరులో లారీ పరిశ్రమ ప్రధానం. లారీలపై వేలాది మంది బతుకుతున్నారు. ఈ పరిశ్రమ ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉంది. నష్టాలతో నడుపుతున్నాం. ఈ పరిశ్రమపై భారం తగ్గించి... లాభాలతో నడిచే విధంగా చూడాలి.

- నులకల సాంబ, లారీ ఓనర్, సాలూరు

నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

కొమరాడ: ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నామినేషన్ కేంద్రానికి మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. అభ్యర్థితో సహా మొత్తం ఐదుగురికే నామినేషన్ కేంద్రానికి వెళ్లడానికి అవకాశం ఉంటుంది. అభ్యర్థులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తమ నామినేషన్లను దాఖలు చేయొచ్చు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా 100 నెంబరుకు ఫోన్ చేస్తే తక్షణమే పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలిస్తారు. ఇందుకు సంబంధించి సెంట్రల్ ఫోర్స్ కూడా అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరంలోనే అభ్యర్థులు తమ వాహనాలు నిలిపివేసి నామినేషన్ పత్రాలు దాఖలు చేయవలసి ఉంటుంది.



- నత్తనడకన ఎస్.కోట ఆసుపత్రి భవన నిర్మాణం
- కంకర స్థాయిలోనే గిరిజన గ్రామాల రోడ్లు
- ప్రకటనకే పరిమితమైన పెందుర్తి-బొడ్డవర రహదారి విస్తరణ
- అప్‌గ్రేడ్ కాని కళాశాలలు

మాటల కోటలే!



నిర్మాణ దశలోనే ఉన్న ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి భవనాలు



దబ్బగుంట - పల్లపుదుంగాడ రోడ్డు దుస్థితి

శృంగవరపుకోట నియోజకవర్గంలో అధికార వైసీపీ ఇచ్చిన హామీలకు... ఆచరణకు హస్తిమశకాంతరం తేడా ఉంది. విద్య..వైద్యం...ఇలా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రభుత్వ పాలనపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

(శృంగవరపుకోట)

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 50 పడకలతో ఉన్న శృంగవరపుకోట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిగా మార్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఇంతలో 2019 సార్వత్రిక ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారింది. అప్పటికే సాధారణ 50 పడకలతో పాటు 40 పడకలు సీమాంక్ (మాతా శిశు సంరక్షణ)కు ఉన్నాయి. మొత్తం 90 పడకలు ఉన్న ఈ ఆసుపత్రిని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రాంతీయ ఆసుపత్రిగా రూపాంతరం చేస్తున్నట్టు ప్రకటించింది. భవనాల నిర్మాణాలకు రూ.12.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో పనులు చేసేందుకు 2020 అక్టోబరు 26న ప్రారంభించారు. 2022 జనవరి 25నాటికి పనులు పూర్తిచేయాలని నిర్ణయించారు. గడువు ముగిసి రెండేళ్లు పూర్తవుతున్నా.. ఇప్పటికి భవనాలు నిర్మాణ దశలోనే ఉన్నాయి. నిధులు లేకపోవడంతో పనులు ఆపేశారు. ఎప్పటికి పూర్తిచేస్తారో తెలియని పరిస్థితి.

అప్‌గ్రేడ్ చేశామన్నారు..

జామి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం చేపడుతున్నట్టు వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చెబుతోంది. ప్రతి విద్యా సంవత్సరానికి నెల రోజుల ముందు ప్రజా ప్రతినిధులకు హడావిడి చేయడం అలవాటుగా మారింది. ఐదేళ్లు గడిచినా ఇప్పటికి ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులోకి రాలేదు. గత ఏడాది జామి ఉన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు చెప్పారు. ఇంతవరకు అమలుకు మాత్రం నోచుకోలేదు.



అప్‌గ్రేడ్ కోసం ఎదురుచూస్తున్న జామి జడ్పీ ఉన్నత పాఠశాల

డిగ్రీ కళాశాల ఎప్పుడో?

కొత్తవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటును గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రచార అస్త్రంగా వాడుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దీని ఊసేత్తలేదు. దీంతో ఈ మండల పరిధిలోని విద్యార్థులంతా విజయనగరం, ఎస్.కోట, విశాఖ పరిధిలోని కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది

కొన్ని పనులు కొనసాగుతూనే..

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కొన్నింటికి నిధులు కేటాయించినప్పటికీ సంవత్సరాల పొడవునా పనులు సాగిస్తున్నారు. నిధులు ఎప్పటికప్పుడు మంజూరు చేయకపోవడంతో పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. విశాఖ-అరకు రోడ్డుకు ఆనుకొని ఉన్న కుల్లి కోనేరు శుద్ధి, సుందరీకరణ, కళ్లెం గెడ్డ ఆధునీకరణ, పుణ్యగిరి ఆలయ అభివృద్ధి, వేపాడ మండల పరిధిలోని సోంపురం-అనందపురం రోడ్డు విస్తరణ, భీమసింగి చక్కెర కర్మాగారం తెరిపించడం... తాటిపూడి, రైవాడ రిజర్వాయర్‌ల నీటిని స్థానిక అవసరాలకు వినియోగించుకోవడం వంటి హామీలు నెరవేరలేదు.

ఎన్నాళ్లీ డోలీ మోత..?

శృంగవరపుకోట మండలం దారపర్తి గిరిజన గ్రామానికి గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి నిధులు తీసుకొచ్చారు. అటవీ శాఖ అధికారుల నుంచి సకాలంలో అనుమతులు రాకపోవడంతో రెవెన్యూ పరమైన చిక్కులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేలోపే 2019 సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. అధికారం చేపట్టిన వైసీపీ ఈ రోడ్డును పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. నేటికీ పట్టించుకోకపోవడంతో అనారోగ్యానికి గురైన గిరిజనులు డోలీ కట్టుకొని కిందికు వచ్చేక్రమంలో ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో జనం ఆందోళనకు దిగారు. చేసేదేమీ లేక దబ్బగుంట నుంచి పల్లపు దుంగాడవరకు ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.489.08 లక్షలతో 6.10 కిలో మీటర్లు రోడ్డు నిర్మాణానికి ముందుకు వచ్చారు. 2021 జూన్ 21న పనులు ప్రారంభించారు. 2022 జూన్ 20 నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి కంకర స్థాయిలో రోడ్డు ఉంది.





విస్తరణకు నోచుకోని పెందుర్తి- బొడ్డవర రహదారి

కానరాని రోడ్డు విస్తరణ

విశాఖ జిల్లా ఎన్ఏడీ కొత్తరోడ్డు నుంచి అరకు పర్యాటక ప్రాంతం వరకు ఉన్న రోడ్డును చాలా కాలం క్రితమే పెందుర్తి వరకు నాలుగు వరుసలుగా విస్తరించారు. ఇక్కడి నుంచి బొడ్డవర వరకు ఈ రోడ్డును విస్తరించాలని శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల ప్రజలు డిమాండ్ చేయడంతో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ కృషితో జాతీయ రహదారిగా మార్పు చేయించారు. రోడ్డు విస్తరణకు నిధులు రాబట్టారు. పనులు ప్రారంభించేందుకు చూస్తున్న దశలో 2019 ఎన్నికలు సమీపించాయి. వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి ప్రతి డిసెంబరు నెలలోనూ రోడ్డు విస్తరణ పనులు చేపడతామంటూ స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ చెబుతూ వచ్చారు. ఏడాది కిందట రూ.740కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని ప్రకటించారు. అధికారులు భూసేకరణ ప్రక్రియకు తెరలేపారు. ఐదేళ్లగా ఇలా కాలక్షేపం చేశారు తప్ప రోడ్డు విస్తరణ పనులు మాత్రం జరగలేదు. ఈ ఇరుకు రోడ్డులో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

తప్పుడు సమాచారం ఇచ్చారో..

- తిప్పలు తప్పవు
- ఎన్నికల్లో అఫిడవిటే కీలకం
- అన్ని వివరాలు పొందుపర్చాల్సిందే

విజయనగరం: ఎన్నికల్లో అఫిడవిట్ కీలకంగా మారింది. నామినేషన్ పత్రాలతో పాటు ఫారం-26 అఫిడవిట్ దాఖలు చేయాలి. అభ్యర్థులు తమ వివరాలతో పాటు ఆస్తులు, అప్పుల గురించి ప్రమాణ పత్రం రూపంలో స్పష్టం చేయాలి. గతంలో ఏమైనా కేసులు ఉన్నా, శిక్షపడినా వాటినీ పొందుపరచాలి. ఇందులో తప్పుడు సమాచారం ఇస్తే అదే ప్రత్యర్థులకు ఆయుధమై కోర్టు కేసుల వరకు వెళ్లడమే కాకుండా అనర్హత వేటుకు దారితీసే అవకాశముంటుంది.

అన్నీ పూరించాలి

అఫిడవిట్‌లోని ఏ ఒక్క కాలమ్ ఖాళీగా వదలరాదని ఈసీ స్పష్టం చేసింది. అభ్యర్థులకు సంబంధం లేకపోతే ఆ కాలమ్ నిల్ లేదా వర్తించదని రాయాలని తెలియజేసింది. అభ్యర్థి సమర్పించిన అఫిడవిట్‌ను గమనించి ఏదైనా సమాచారం లేకపోతే ఆర్వో నోటీసు ఇస్తారు. దీంతో సవరించిన అఫిడవిట్‌ను అభ్యర్థి అందించాలి. అయినా పూర్తిస్థాయి వివరాలతో అఫిడవిట్ లేకపోతే పరిశీలన సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్‌ను ఆర్వోలు నోటీసు బోర్డు, వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.

నేర సమాచారం తప్పనిసరి

క్రిమినల్ కేసులు నమోదై ఉంటే వాటి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలి. ఏదైనా కేసులో న్యాయస్థానాలు గతంలో శిక్ష విధించినా, అప్పీల్‌కు వెళ్లినా వాటి సమాచారాన్ని ప్రస్తావించాలి. సామాజిక మాధ్యమాల ఖాతాలను కూడా తెలియజేయాలి. అన్ని వివరాలతో కూడిన అఫిడవిట్‌కు నోటరీ తప్పనిసరి. సాధారణంగా నామినేషన్ దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి ముందు అభ్యర్థి ప్రమాణం చేస్తారు. ఇతరులు ఎవరైనా నామినేషన్ సమర్పిస్తే అభ్యర్థి తాను ఉన్న ప్రాంతంలోని మెజిస్ట్రేట్ ఎదుట ప్రమాణం చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా అభ్యర్థులపై నమోదైన కేసుల వివరాలను ప్రముఖ దినపత్రికల్లో స్పష్టంగా కనిపించేలా ప్రకటనలు ఇవ్వాలి.



అప్పులు, ఆస్తులు పక్కాగా ప్రస్తావించాలి

స్థిర, చరాస్తుల వివరాలతో పాటు చేతిలో, బ్యాంకు ఖాతాల్లోని నగదు, డిపాజిట్లు, ఇతర సేవింగ్, బీమా పాలసీలు,అప్పులు తదితరాలు పొందుపరచాలి. ఆభరణాలు, వాహనాలు, వ్యవసాయ భూములు, వాణిజ్య సముదాయాలు, నివాస స్థలాల వంటివాటిని అఫిడవిట్‌లో ప్రస్తావించాలి. అవి వారసత్వంగా వచ్చాయా లేదా కొనుగోలు చేశారా అన్నది తెలియజేయాలి. స్థిరాస్తులకు సంబంధించి ప్రస్తుత మార్కెట్ విలువలను పొందుపరచాలి. అభ్యర్థితోపాటు కుటుంబ సభ్యుల పేరిట రుణాలు ఉంటే వాటి వివరాలనూ ప్రస్తావించాలి. కుటుంబ సభ్యుల ఆదాయ మార్గాలు, ప్రభుత్వం లేదా ప్రైవేటు కంపెనీల కాంట్రాక్టులు ఉంటే వాటి వివరాలు తెలియజేయాలి.

వివరాలు తెలుసుకోవడం ఓటర్ల హక్కు

ప్రజాప్రతినిధిగా ఎన్నుకోబోయే అభ్యర్థికి సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకోవడం ఓటర్ల హక్కు. అప్పుడే అభ్యర్థులపై ఓ స్పష్టత వస్తుంది. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే అభ్యర్థులు తమ నామినేషన్‌తో పాటు అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనలకు లోబడి ఫారం-26 రూపంలో అభ్యర్థులు అఫిడవిట్ సమర్పించాలి. ఇందులో అభ్యర్థులు ఆస్తులు, అప్పులు, కేసుల సమాచారంతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు తెలియజేయాలి.

అభ్యర్థికి ఒకటి.. వెనుక రెండు!


సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థితో పాటు మరో రెండు వాహనాలకు మాత్రమే ఎన్నికల సంఘం అనుమతిస్తుంది. అనుమతి లేకుండా వాహనాలను తిప్పితే సీజ్ చేసే అధికారం ఎన్నికల సంఘానికి ఉంది. అభ్యర్థుల ప్రచారంపై నిఘా ఉంది. రెవెన్యూ పోలీసు తదితర అధికారులు పార్టీ నాయకుల కదలికలను గమనిస్తున్నారు. వాహనాలు, ప్రచారానికి పెడుతున్న ఖర్చులను లెక్కిస్తున్నారు. అభ్యర్థులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకొనే అవకాశం ఉంది.

- శృంగవరపుకోట



ప్రచురణకర్తలూ..

తస్మాత్ జాగ్రత్త



- నిబంధనలు ఉల్లంఘిస్తే కోర్టును ధిక్కరించినట్లే
- ప్రచారంలో మార్గదర్శకాలపై ఈసీ ఉత్తర్వులు జారీ

విజయనగరం: ఎన్నికలు అనగానే అన్నిపార్టీలు ప్రచారానికి అధిక ప్రాధాన్యం ఇస్తాయి. ఓటర్లను ప్రభావితం చేసి తమ వైపు తిప్పుకోవడం కోసం మేనిఫెస్టో ప్రకటించి చేయబోయే పనులు, హామీలు గుప్పిస్తాయి. దీనికితోడు గతంలో నెరవేర్చిన వాగ్దానాలను కూడా ప్రచారాస్త్రాలుగా మార్చుకుంటాయి. దీనికోసం కరపత్రాలు, ఫ్లెక్సీలు ముద్రిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రచారం తాలూకా ప్రచురణపై కొన్నిమార్గదర్శకాలు ఈసీ జారీచేసింది. ఈ విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్-127 ప్రకారం విధించిన నిబంధనలను ఉల్లంఘిస్తే కోర్టుని ధిక్కరించినట్లే భావిస్తారు. ఎటు వంటి తేడా వచ్చినా చట్టప్రకారం కేసు నమోదుచేస్తారు. జిల్లాలో ఇప్పటికే ప్రచారం జోరందుకుంది. రాష్ట్ర నాయకత్వం పంపించిన ప్రచార సామగ్రికి అభ్యర్థులు తయారు చేసుకుంటున్న ప్రచార సామగ్రి తోడవుతోంది. ఈ నేపథ్యంలో ప్రచురణలపై, ఎన్నికల సంఘం వెలువరించిన ఉత్తర్వులపై కథనం.

- గోడపత్రికలు, ఫ్లెక్సీలు, కరపత్రాలు ముంద్రించేవ్యక్తి (ప్రచు రణకర్త) డిక్లరేషన్ తాలూక రెండు ప్రతులను తనకు వ్యక్తిగతంగా తెలిసిన ఇద్దరు వ్యక్తుల సంతకాలతో ప్రింటర్‌కు ఇవ్వాలి. డిక్లరేషన్ నమూనాను ఆయా నియోజకవర్గ ఎన్నికల అధికారి నుంచి పొందాలి.
- ముద్రణ పూర్తయ్యాక డిక్లరేషన్ తాలూక ఒక ప్రతిని ముద్రించిన ప్రతితో జతచేసి రాష్ట్ర రాజధాని అయిన పక్షంలో ప్రధాన ఎన్నికల అధికారికి, జిల్లా కేంద్రంలో అయితే జిల్లా కలెక్టర్‌కు అందజేయాలి.
- ఏ రాజకీయ పార్టీ అయినా, పోటీ చేసే అభ్యర్థి అయినా ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆరు నెలలు జైలు లేదా రూ. 2వేలు జరిమానా లేదా రెండూ విధించే అవకాశాలు ఉన్నాయి.
- పత్రికల్లో ప్రత్యేకంగా ఒక రాజకీయ పార్టీకి లేదా అభ్య ర్థులకు అనుకూలంగా వచ్చే వార్తా కథనాలు, సంపాదకీయాలు తదితర వాటిపై నిశిత పరిశీలిన చేయడానికి ఎన్నికల సంఘం సూచనలు జారీ చేసింది.
- ప్రజా ప్రాతినిధ్యచట్టం-1951లోని సెక్షన్ 77(1) ప్రకారం ఈ కథనాలకు అయ్యే ఖర్చును సైతం రాజకీయ పార్టీలు,పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయ ఖాతాలో నమోదు చేసే అవకాశముంది.
- ఒకవేళ అభ్యర్థి అనుమతి లేకుండా ప్రకటనలు, వార్తా కథ నాలు ముద్రిస్తే ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 171 హెచ్ ప్రకారం చర్యలు తీసుకుంటారు.
- పత్రికల్లో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రత్యేకంగా ఏ అభ్యర్థిపక్షానైనా ప్రకటనలు ఇచ్చేందుకు లేదా ఏ అభ్యర్థిపై వ్యతి రేకంగా ప్రకటనలు ఇచ్చేందుకు ముద్రించే వారి పేరు (ప్రచురణ కర్త), ముద్రించిన ప్రకటన ప్రతిని సమర్పించాలి.

అప్పుడెప్పుడో ఇందిరమ్మకి ఓటేసినాను...
మళ్లీ ఎన్టీఓడికి ఏసినాను

పెద్దలమాట

● వందేళ్ల వృద్ధురాలు సీదరపు జట్టో



బొబ్బిలి: 'అప్పుడెప్పుడో ఇందిరమ్మకు ఓటేసినాను బాబూ..మళ్లీ ఎన్టీవోడికి ఏసినాను. ఇప్పుడు ఎవులెవులో వత్తన్రు. నాకేటి తెల్లదు...రాజు గారు కూడా వచ్చి ఓటడిగినారు.. మావోల్లు (కుటుంబ సభ్యులు) ఎవులికి సెబితే ఆలకే ఏత్తాను' అంటోందీ అవ్వ. బొబ్బిలి మండలం చిత్రకోటబొడ్డవలస పంచాయితీ కొత్తవలస (కొత్తూరు) గ్రామానికి చెందిన ఈ వృద్ధురాలి పేరు సీదరపు జట్టో. ఆమె వయసు వందేళ్లని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. 'ఎన్నికలొచ్చాయి కదా ..ఎవరికి ఓటు వేస్తావు అవ్వా?' అని అడిగితే..ఆమె పైవిధంగా చెప్పుకొచ్చింది. 'నాకు ఆరుగురు పిల్లలు. అందరూ కాయకట్టంసేసి బతుకుతున్నారు..'అని చెప్పింది. ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడితే... 'మేం పదేళ్ల క్రితం సాలూరు ప్రాంతం నుంచి వలస వచ్చాం. ఇక్కడ పోడు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు ఇళ్లు, రోడ్లు వేయించేందుకు బేబీనాయన బాగా సహకరించారు. భూముల సాగులో ఆయన మాకు పూర్తి సహకారం ఇస్తున్నారు. రెండు గొర్రె పిల్లలతో వచ్చాం. ఇప్పుడు పశుసంపద పెరిగింది. వ్యవసాయం కూడా బాగా చేసుకుంటున్నాం' అని ఆ గిరిజనులు తెలిపారు.

ఒక్క ఓటు అని వదిలేస్తే!

● అధికారమే తారుమారు..
● మీ ఓటుకు ఎంతో ప్రాధాన్యం
● భవిష్యత్తును నిర్ణయించుకోవలసింది మీరే

(రాజాం రూరల్)

మనం ప్రయాణించాల్సిన బస్సో, రైలో తప్పిపోతే కాస్త ఆలస్యంగానైనా గమ్యస్థానం చేరుకోవచ్చు. అదే ఓటు వేయకపోతే...మళ్లీ అయిదేళ్ల దాకా ఆ అవకాశం కోల్పోయినట్టే. మనది ఒక్క ఓటే కదాని అలక్ష్యం చేస్తే అయిదేళ్ల నిర్లక్ష్యానికి గురవుతాం. గతంలో ఒక్క ఓటు తేడాతో ఎన్నో సంచలనాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వాలు కూలిపోయాయి. ఎందరికో అధికారాలు దూరమయ్యాయి. చేతికి అందివస్తాయనుకున్న అవకాశాలు రాకుండాపోయాయి.

ఇవిగో కొన్ని ఉదాహరణలు...

● 1999లో ఒక్క ఓటు తేడాతో వాజ్‌పేయి అధికారాన్ని కోల్పోయారు..

● ఒక్క ఓటు తేడాతో ఆంగ్లంపై గెలిచి హిందీ మన దేశ జాతీయ భాషగా గుర్తింపు పొందింది..

● 2008లో రాజస్థాన్ శాసనసభ ఎన్నికలలో ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు సీపీ జోషి ఒక్క ఓటు తేడాతో ఓడిపోయారు. ఆయన గెలిస్తే ముఖ్యమంత్రి పదవి వరించేది.

● 1776లో అమెరికాలో ఒకే ఒక్క ఓటు తేడాతో జర్మన్‌కు బదులుగా ఇంగ్లిష్ అధికార భాష అయ్యింది.

● 1714లో ఒక ఓటు తేడాతో కింగ్ జార్జి-1 ఇంగ్లండ్‌లో పీఠమెక్కారు..

● 1800లో థామస్ జెఫర్‌సన్, 1824లో జాన్ క్వీన్స్ ఆడమ్స్.. 1876లో రూథర్‌ఫర్డ్ హేస్‌లు ఎలక్టోరల్ కాలేజ్‌లో ఒకే ఒక్క ఓటు తేడాతో అమెరికా అధ్యక్షులుగా పదవులను అధిష్ఠించారు.

● 1923 నవంబరు 8న జర్మనీలో నాజీ పార్టీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలలో ఒకేఒక్క ఓటు తేడాతో అడాల్ఫ్ హిట్లర్ ప్రత్యర్థి ఓడిపోయాడు.. లేకుంటే ప్రపంచ చరిత్ర వేరేవిధంగా ఉండేదేమో.

● ఇప్పుడు మీకున్న ఇక్క ఓటుకూ అంతటి శక్తి ఉందేమో.. మీ ఒక్క ఓటే సంచలనం సృష్టించవచ్చు. అభివృద్ధి చేసేవారికి ఓటు వేయండి. మీ భవిష్యత్తును మీరే మార్చుకోండి.

జన కేతనం
ఆంధ్రజ్యోతి సోమవారం 22 ఏప్రిల్ 2024

గిరిజనం కరుణిస్తే..
అధికారం చిక్కినట్టే!

సాలూరు నియోజకవర్గం ముఖచిత్రం

● రాష్ట్రంలోనే పురాతన మున్సిపాలిటీగా ప్రసిద్ధి
● ఇద్దరు గిరిజన సంక్షేమ శాఖ మంత్రులను అందించిన ఘనత
● ఇదీ ఏడు దశాబ్దాల సాలూరు ప్రత్యేకత

(సాలూరు)

సాలూరు.. వేగావతి నది తీరాన వెలసిన పట్టణం. రాష్ట్రంలో భీమిలి తరువాత అతి పురాతన మున్సిపాలిటీ. దీనిని కేంద్రంగా చేసుకొని 1951లో సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది. తొలుత జనరల్‌గా ప్రారంభమై.. క్రమేణా ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. 72 ఏళ్ల చరిత్ర కలిగిన సాలూరు నియోజకవర్గంలో అభివృద్ధి అంతంత మాత్రమే. నియోజకవకర్గం ఆవిర్భవించిన సమయంలో మొత్తం ఓటర్లు 77,570 మంది మాత్రమే. ప్రస్తుతం 2,01,441 మంది. సాలూరు మున్సిపాలిటీ, మండలం, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాలతో సాలూరు నియోజకవర్గం ఏర్పడింది. ఇది వ్యవసాయ ప్రధాన ప్రాంతం. కూలీలు, రైతులు అధికంగా ఉంటారు. సాలూరు మున్సిపాలిటీ మాత్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లారీ పరిశ్రమలో విజయవాడ తరువాత ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకుంది. నియోజకవర్గంలో ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులు, అపారమైన ఖనిజ సంపద ఉన్నా... నడిపించే నాయకులు సమర్థులు లేకపోవటంతో నిత్యం వెనకబాటుతో... నిరక్షరాస్యతతో... పేదరికంతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఎన్నో జీవనదులు ఈ నియోజకవర్గం సొంతం. రైతులకు సాగు... తాగు నీరు అందించే మూడు జలాశయాలు ఉన్నా... ప్రజలు మాత్రం నిత్యం ఇబ్బందులు పడుతునే ఉన్నారు. ఎమ్మెల్యేగా ఎవరు ఎన్నికవ్వాలో గిరిజన తాండాలే నిర్ణయిస్తాయి. గిరిజన తాండాల అభిమానాన్ని ఓట్ల రూపంలోకి ఎవరు మలుచుకోగలరో...వారే ఎన్నికయ్యే అవకాశాలు ఉంటాయి.

వనరులు పుష్కలం..


సాలూరు నియోజకవర్గంలో పుష్కలంగా జలవనరులు ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తేవటంలో పాలకులు విఫలమయ్యారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఈ నియోజకవర్గంలో రామభద్రపురం మండలం ఉండేది. తర్వాత ఈ మండలాన్ని బొబ్బిలి నియోజకవర్గంలో విలీనం చేశారు. గజపతినగరం నియోజకవర్గంలోని మెంటాడ, పార్వతీపురం నియోజకవర్గంలోని మక్కువ మండలాలు సాలూరు నియోజకవర్గంలో విలీనమయ్యాయి. నియోజకవర్గంలో రాజకీయాలు పునర్విభజనకు ముందు ఒక విధంగా ఉంటే.. తర్వాత మరో విధంగా ఉన్నాయి. రామభద్రపురం మండలం సాలూరు నియోజకవర్గంలో ఉన్నంత కాలం ఈ నియోజకవర్గం టీడీపీకి కంచుకోటలా ఉండేది. బీసీలు ఎక్కువగా ఉండే రామభద్రపురం మండలం బొబ్బిలి నియోజకవర్గంలోకి వెళ్లిపోయిన తరువాత టీడీపీకి కొంత ప్రతికూల పరిస్థితులు మొదలయ్యాయి. 2009 ఎన్నికలకు ముందు వరుసగా మూడుసార్లు విజయం సాధించిన టీడీపీకి ఆ తర్వాత ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్పటి నుంచి కాంగ్రెస్, వైసీపీ అభ్యర్థుల విజయ పరంపర కొనసాగుతోంది.

ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు :	2,01,441
పురుషులు :	98,189
మహిళలు :	1,03,248
ఇతరులు:	4
పోలింగ్ బూత్‌లు:	243

ఇవీ విశిష్టతలు

కోరిన కోర్కేలు తీర్చే కల్పవల్లి, గిరిజనుల ఆరాధ్యదైవం... ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శంబర పోలమంబ అమ్మవారు ఈ నియోజకవర్గంలోనే వెలిశారు. దేశంలో ఎక్కడా లేని రైలు బస్సు (ప్రస్తుతం రద్దు చేశారు.) ఇక్కడ నడిచేది. సాలూరు ప్రజలు ఆరాధ్యదేవత శ్రీశ్యామలాంబ... పంచముఖేశ్వర స్వామి ఆలయాలు ఆధ్యాత్మికతకు నెలవు. అతి ఎత్తయిన శిఖరం పై వెలసిన పారమ్మతల్లి అమ్మవారు.. ప్రకృతి రమణీయతకు మారుపేరుగా నిలుస్తున్న జలపాతాలు.. వేగావతి నదిపై నిర్మించిన పెద్దగెడ్డ జలాశయం, వెంగళరాయసాగర్, ఆంధ్ర జలాశయాలు ఈ ప్రాంతంలో ముఖ్య సాగునీటి వనరులు.



సాలూరు నియోజకవర్గ మ్యాప్

సాలూరు ఎమ్మెల్యేలుగా వీరే..

సం.	అభ్యర్థి	పార్టీ
1952	వీడీపీ దేవ్	కాంగ్రెస్
1952	కేవీ దొర	కేఎల్‌పీ
1955	బి.రాజయ్య	కాంగ్రెస్
1955	(ద్వి) ఏవై నాయుడు	పీఎస్‌పీ
1962	ఎల్ఎన్ సన్యాసిరాజు	స్వతంత్ర
1967	బి.రాజయ్య	స్వతంత్ర
1972	జన్ని ముత్యాలు	కాంగ్రెస్
1978	ఎస్ఆర్‌టీపీ రాజు	సీపీఐ
1983	బి.రాజయ్య	టీడీపీ
1985	బి.రాజయ్య	టీడీపీ
1989	ఎల్ఎన్ సన్యాసిరాజు	కాంగ్రెస్
1994	ఆర్పీ భంజ్‌దేవ్	టీడీపీ
1999	ఆర్పీ భంజ్‌దేవ్	టీడీపీ
2004	ఆర్పీ భంజ్‌దేవ్	టీడీపీ
2009	పి.రాజన్నదొర	కాంగ్రెస్
2014	పి.రాజన్నదొర	వైసీపీ
2019	పి.రాజన్నదొర	వైసీపీ

ఎమ్మెల్యేలుగా ఇలా...



కూనిశెట్టి వెంకటనారాయణదొర



ఆర్పీ భంజ్‌దేవ్



జన్ని ముత్యాలు



అల్లు ఎరుకునాయుడు



పీడిక రాజన్నదొర

1952లో జరిగిన ఎన్నికల్లో కృషికార్ లోకపార్టీ అభ్యర్థిగా పోటీచేసిన కూనిశెట్టి వెంకటి నారాయణ దొర మొదటి ఎమ్మెల్యే అయ్యారు. 1955 ఎన్నికల్లో అల్లు ఎరుకునాయుడు ప్రజా సోషలిస్ట్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. 1962లో ఎల్.ఎన్.సన్యాసిరాజు ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎమ్మెల్యే అయ్యారు. 1967లో గిరిజన నాయకుడు ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసిన బోయిన రాజయ్య ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 1972లో గిరిజన నాయకుడు జన్ని ముత్యాలు కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. 1978లో సీపీఐ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఎస్ఆర్‌టీపీ వీరపరాజు ఎమ్మెల్యేగా గెలిచారు. నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా కమ్యూనిస్ట్ పార్టీ జెండా ఎగిరింది. 1982 టీడీపీ ఆవిర్భావం తర్వాత కొంతకాలం విజయ దుందుబి మోగించింది. 1985లో బోయిన రాజయ్య టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నియోజకవర్గంలో తొలిసారిగా ఎన్టీఆర్ ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1989లో ఎల్.ఎన్.సన్యాసిరాజు కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. 1994, 1999, 2004 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా రాజేంద్రప్రతాప్ భంజ్‌దేవ్ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రికార్డును సొంతం చేసుకున్నారు. 2004లో భంజ్‌దేవ్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసినపుడు కాంగ్రెస్ పార్టీ నుంచి పీడిక రాజన్నదొర ఆయన చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత భంజ్‌దేవ్ ఎస్టీ కాదని పేర్కొంటూ... రాజన్నదొర హైకోర్టులో కేసు వేశారు. దీనిపై 2006లో హైకోర్టులో తీర్పు నేపథ్యంలో భంజ్‌దేవ్ ఎమ్మెల్యే పదవిని కోల్పోయారు. రాజన్నదొర ఎన్నికైనట్లు కోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాజన్నదొర మూడుసార్లు ఎన్నికయ్యారు. ఒకసారి కాంగ్రెస్ పార్టీ నుంచి రెండుసార్లు వైసీపీ తరఫున విజయం సాధించారు. రెండో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిలిచారు. 2009 ఎన్నికల్లో పీడిక రాజన్నదొర కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణిపై విజయం సాధించారు. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పీడిక రాజన్నదొర టీడీపీ బలపరిచిన అభ్యర్థి భంజ్‌దేవ్‌పై విజయం సాధించారు. పీడిక రాజన్నదొర ఐదోసారి సాలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల తర్వాత రాజన్నదొర గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా, రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా పదవిని చేపట్టారు. 1985లో టీడీపీ ప్రభుత్వ హయాంలో బోయిన రాజయ్య గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పని చేస్తే... 2019లో రాజన్నదొర మళ్లీ అవే పదవులు సొంతం చేసుకోవడం గమనార్హం. ప్రస్తుతం టీడీపీ తరఫున మాజీ ఎమ్మెల్సీ గుమ్మిడి సంధ్యారాణి బరిలో ఉన్నారు.



శంబర పోలమాంబ



పారమ్మ కొండపై..



ఆహ్లాదపరిచే జలపాతం



సాలూరు పట్టణం



సాలూరుకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన లారీల పరిశ్రమ

బెలూనూ.. చేస్తుంది ప్రచారం

(విజయనగరం రూరల్)

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రంగు రంగుల బెలూన్లకు మంచి డిమాండ్ ఉంటోంది. మామూలు సమయాల్లో వివాహాది శుభకార్యాలు... పుట్టిన రోజు ఫంక్షన్లు... ఇలాంటి రోజుల్లోనే బెలూన్లకు డిమాండ్ ఉంటుంది. ఎలక్షన్ వచ్చిందంటే... తక్కువ డబ్బులతో ఆర్భాటంగా ప్రచారం కనిపించే క్రమంలో బెలూన్లదే అగ్రస్థానం. వివిధ పార్టీల జెండాల రంగుల్లో మార్కెట్‌లో బెలూన్లు సిద్ధంగా ఉంటున్నాయి. తెలుగుదేశం పార్టీకి సంబంధించి పసుపు రంగు బెలూన్లు... జనసేనకు సంబంధించి తెలుపు, బీజేపికి సంబంధించి కాషాయ రంగు... ఇలా విభిన్న వర్ణాల్లో కనువిందు చేస్తున్నాయి. అదే విధంగా అధికార వైసీపీకి సంబంధించి మూడు రంగుల బెలూన్లు కూడా లభిస్తున్నాయి. మామూలు రోజుల్లో బెలూన్లు అమ్మేవారు ఖాళీగా కనిపిస్తారు. ప్రస్తుతం ఎన్నికల పుణ్యమాని వీరు కూడా పది రూపాయలు కళ్ల చూస్తున్నారు. డిమాండ్‌ని దృష్టిలో ఉంచుకొని... మామూలు రోజులు కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.



బెలూన్లకు గాలి నింపుతున్న దృశ్యం



బెలూన్లతో టీడీపీ కార్యకర్తల సందడి

అప్పుడు చెల్లని ఓట్లు-ఇప్పుడు నోటా ఓట్లు

● మార్చనున్న అభ్యర్థుల తలరాత

మీకు తెలుసా!



విజయనగరం: ఈవీఎంలు రాకముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగేది. బ్యాలెట్ పేపర్‌పై ఉన్న గుర్తులను సరిగా చూసుకొని ఓటరు తన ఇష్టమైన గుర్తుపై ఓటేసేవారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్‌లో అక్కడక్కడ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఉద్దేశంతో ఈవీఎంలను ప్రవేశపెట్టారు. నిరక్షరాస్యులు, వృద్ధులు బ్యాలెట్ పత్రంపై ఓటేసేటప్పుడు సరైన అవగాహన లేని కారణంగా స్వస్తిక్ ముద్రను సరిగా వేసేవారు కాదు. దీంతో అలాంటి ఓట్లను చెల్లని ఓట్లుగా పరిగణించేవారు. ఈవీఎంలు వచ్చిన తర్వాత అలాంటి సమస్యలేనప్పటికీ, నోటా (పై వారిలో ఎవరూ కాదు) అనే అనే ఆప్షన్ ఇచ్చారు. బ్యాలెట్ పత్రంపై తెలియక చెల్లని ఓట్లు పోలైతే, ఈవీఎంల్లో అన్నీ తెలిసినప్పటికీ నోటా ఓట్లు పోలవుతున్నాయి.

ఓటు హక్కు అందరూ వినియోగించుకోవాలి

18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు రాజ్యాంగం ప్రసాదించింది. ప్రతి ఓటరు తమ హక్కును వినియోగించుకోవాలి. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్, మేధావులు, రాజకీయ పార్టీలు పదే పదే చెబుతుంటాయి. ఒక్కో నియోజకవర్గంలో చాలా మంది ఎన్నికల బరిలో ఉంటారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు ఓటేయడం ఇష్టం లేకపోతే చిట్టచివరన ఉన్న నోటా బటన్‌పై నొక్కితే సరిపోతుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారిగా కేంద్ర ఎన్నికల సంఘం నోటాకు అవకాశం కల్పించింది.



విజేత మెజార్టీ కన్నా నోటా ఓట్లే ఎక్కువ..

గత ఎన్నికలను పరిశీలిస్తే విజయం సాధించిన అభ్యర్థి మెజార్టీ కంటే నోటా ఓట్లే ఎక్కువ పోలైన సందర్భాలు ఉన్నాయి. గతంలో రాజస్థాన్, ఢిల్లీ, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, మిజోరాం తదితర రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడక్కడ విజేత మెజార్టీ కంటే నోటా ఓట్లు ఎక్కువగా పోలవ్వడం చర్చనీయాంశమైంది. నాడు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగేటప్పుడు చెల్లని ఓట్లు, నేడు ఈవీఎం పద్ధతిలో నోటా ఓట్లు అభ్యర్థుల తలరాతను మారుస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. గత ఎన్నికల్లో సుమారు ఒక శాతం నోటాకు ఓటర్లు ఓటేశారు.

లారీ ఢీకొని మహిళ మృతి

పాలకొండ: లారీ ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన పాలకొండలోని పురటాల పోలమాంబ ఆలయానికి ఎదురుగా ఆదివారం చోటుచేసుకుంది. వీరఘట్టం మండలం విక్రంపురం గ్రామానికి చెందిన డోటు అనూరాధ(41) తన భర్త శ్రీనివాసరావుతో కలిసి స్వగ్రామం నుంచి సరుబుజ్జిలి మండలానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. పాలకొండ రహదారిలోని పురటాల పోలమాంబ ఆలయం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో అనూరాధ ద్విచక్ర వాహనం నుంచి జారి కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పాలకొండ పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేశారు. కళ్ల ముందే భార్య మృతి చెందడంతో శ్రీనివాసరావు బోరున విలపించాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

● పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జయకృష్ణ



ప్రచారం చేస్తున్న జయకృష్ణ

వీరఘట్టం: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ అన్నారు. ఆదివారం తెట్టంగి గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. కూటమి నాయకులు కర్నేన అప్పలనాయుడు, పాలవలస యశస్వి, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, నిమ్మక పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

● డెప్పివలస గ్రామంలో పలువురు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. వీరంతా కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

కురుపాం: కురుపాంలో వైసీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న కార్యకర్తలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. ఆదివారం కురుపాం కోటలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. టీడీపీలో చేరినవారిలో వైసీపీ సీనియర్ కార్యకర్త మంతిన త్రిపురనాథ్, వార్డు మెంబర్ గెంబలి నాగరాజు, గోళ్లవలసకు చెందిన శెట్టి శ్రీనివాసరావు, కిచ్చాడకు చెందిన సందీప్, వైసీపీ యువ కార్యకర్త సిల్ల సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, పాడి సుధ, పార్టీ నాయకుడు చందక రామకృష్ణ పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

బలిజిపేట: సుభద్ర గ్రామంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు ఆదివారం జనసేన పార్టీలో చేరాయి. జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు సమక్షంలో వీరంతా ఆ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జీవో నెం-3 అమలు చేస్తాం

సీతంపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే జీవో నెంబరు-3 అమలు చేయడం తథ్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మాజీ చైర్మన్ కొండారెడ్డి నరహర ప్రసాద్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుని, ఐటీడీఏలకు పూర్తిస్థాయి నిధులు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీసీ మెంబర్ సోముల నాయక్, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి, తెల్ల మల్లేశ్వరరావు, బిడ్డిక చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు వాయిదా



మాట్లాడుతున్న సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ రాజేంద్రరావు

గరుగుబిల్లి: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనుల పరిశీలనకు సంబంధించి సామాజిక తనిఖీలు వాయిదా వేసినట్టు ఎస్ఆర్‌పీ డి.రాజేంద్రరావు తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్పీలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల్లో నిర్వహించాల్సిన తనిఖీలను ఎన్నికల నేపథ్యంలో నిలుపుదల చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. తదుపరి ఆదేశాలు వచ్చిన వెంటనే పంచాయతీల్లో పరిశీలన చేస్తామన్నారు. ● ప్రతి మండలంలో వేతనాలు, మెటీరియల్ నిర్వహణకు సుమారు రూ.20 కోట్లుకు పైగా వ్యయం చేశారు. దీనిపై పరిశీలన చేసి, లోపాలు ఉన్నట్లయితే ప్రజావేదికలో కాకుండా అధికారుల సమక్షంలోనే తగిన నిర్ణయాలు తీసుకొనేలా ఇటీవల ఆదేశాలు జారీ అయ్యాయి. ఈనెల 24 నుంచి పరిశీలన చేయాల్సి ఉంది. అయితే ఎన్నికలు కోడ్ నేపథ్యంలో సామాజిక తనిఖీలను వాయిదా వేశారు.

24న విద్యుత్తు సరఫరాకు అంతరాయం

భోగాపురం: అమటాంరాయవలస విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్తు శాఖ ఏఈ ఎస్‌కే మస్తాన్‌వల్లి ఆదివారం తెలిపారు. ఎ.రాయవలస, దల్లిపేట, గూడెపువలస, రెడ్డికంచేరు, బైరెడ్డిపాలెం, ముగుడపేట, చాకివలస, ఎయిర్‌పోర్టు ఏరియా గ్రామాల్లో విద్యుతు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

గంట్యాడ: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని విజయనగరం రూరల్ సీఐ శ్రీనివాసరావు కోరారు. ఆదివారం సాయంత్రం సిరిపురం, మురపాక, పెదవేమలి గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో పలు వీధుల్లో పోలీసులు తిరిగి, వారి సేవలను వివరించారు. గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు లేకుండా సజావుగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేంద్రనాయుడు, పోలీసు సిబ్బంది, ఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

పిల్లలకు ఉచిత వినికిడి పరీక్షలు

విజయనగరం రింగురోడ్డు: ఆల్బసీ ఆంధ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఐయ్యన్నకోనేరు ఉత్తరగట్టు వద్దగల గాయత్రీ ఆసుపత్రిలో ఐదేళ్ల లోపు వినికిడి లోపం వున్న పిల్లలకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏపీ స్టేట్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టరు డీవీజీ శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినికిడి లోపంతో బాధపడుతున్న పిల్లలకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి రూ.10లక్షలు విలువగల శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఎండీ డాక్టర్ జీవీ వెంకట్, సీనియర్ కోక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ డా.కృష్ణకిషోర్, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయానికి శంకుస్థాపన

భామిని: భామినిలో నూతనంగా నిర్మించనున్న షిర్డీ సాయిబాబా ఆలయానికి ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. ఈసందర్భంగా కాగడాల హారతి, సుప్రభాతం, అభిషేకం, సామూహిక సాయి సత్య వ్రతాలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఎన్నాళ్లకు పూర్తిచేస్తారో?

● కొనసాగుతున్న వీరఘట్టం ప్రధాన రహదారి పనులు

● ధూళి కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

వీరఘట్టం: ఆ రహదారి పనులు ప్రారంభించి రెండేళ్లు పూర్తయింది.. కానీ ఇప్పటికీ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. అరకొర పనుల కారణంగా రహదారిపై నిత్యం ధూళి రేగడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరఘట్టం ప్రధాన రహదారి నాలుగు లైన్ల విస్తరణ పనులకు 2022 సంవత్సరం ఫిబ్రవరి 19న శంకుస్థాపన చేశారు. రూ.5.5 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. అయితే పనులు మాత్రం నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో ధూళి రేగి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తం కావడంతో కొద్దిరోజులు ఆగిన పనులను మళ్లీ ప్రారంభించారు. ఇప్పటికైనా రహదారి పనులు పూర్తిచేస్తారో.. లేదో.. ఎన్నికల కోసం పనులను నెమ్మదిగా కొనసాగిస్తారేమో అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై జేఈ జగన్మోహన్‌రాజును సంప్రదించగా త్వరలో రహదారి పనులు పూర్తిచేస్తామని చెప్పారు.



పనులు నిర్వహిస్తున్న దృశ్యం, వాహనాల రాకపోకలతో రేగుతున్న ధూళి

మన్యంలో ఇటుక పండగ సందడి

● ఆరు రోజులు నిర్వహణ

● తొలిరోజు ఉత్సాహంగా పాల్గొన్న గిరిజనులు

సాలూరు రూరల్: గిరిజనుల పెద్ద పండగగా భావిస్తున్న ఇటుక పండగ మన్యంలో ఆదివారం ప్రారంభమయ్యింది. చైత్రమాసంలో ఆరు రోజులపాటు ఈ పండగను నిర్వహిస్తారు. తొలిరోజున కుటుంబాల వారీగా బియ్యం సేకరించి గత ఇటుక పండుగ తర్వాత వివాహాలు చేసుకున్న తమ కుటుంబంలో జంటలకు భోజనాలు ఏర్పాటు చేస్తారు. వారితో కలసి ఒకే ఇంటిపేరున్న కుటుంబీకులంతా భోజనాలు చేస్తారు. రెండో రోజు కొత్త మామిడితో పచ్చడి చేసి ప్రసాదంగా స్వీకరిస్తారు. అలాగే పితృదేవతలకు కొత్త బట్టలు చూపి మూలన మడపాలు పెట్టి పూజిస్తారు. అలాగే తమ పితృదేవతలకు కోడిని మొక్కుబడిగా సాధిస్తారు. మూడో రోజు నేల తల్లికి పూజలు చేస్తారు. థింసా నృత్యాలు చేస్తారు. నాలుగో రోజు ఇటుక పండుగ చేస్తారు. తొలుత గోనస వేట చేస్తారు. దానిని థింసా వాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగిస్తారు. దానికి గిరిజన పూజారి పూజలు చేస్తారు. అలాగే తమ గ్రామదేవతలకు పూజలు చేస్తారు. పూజలు అనంతరం గోనస పూజకు స్వస్తి చెబుతారు. అనంతరం వేట ప్రధానంగా ఉంటుంది. వేటకు వేళ్లే వారికి భత్యాన్ని సేకరిస్తారు. భత్యం కింద బియ్యం, డబ్బులు, ఇతర సామాగ్రిని సేకరిస్తారు. ఈ సామగ్రితో వేటకు వేళ్లే వారు అడవుల్లో వంట చేసుకోవడానికి వినియోగిస్తారు. ఐదో రోజున వేట సులభంగా సాగి వీలైనంత పెద్ద జంతువు దొరకాలని ఆశిస్తూ అడవి తల్లికి పూజలు చేస్తారు. ఈసందర్భంగా అడవి తల్లికి నైవేద్యంగా కోడిని వదిలి పెడతారు. ఆరో రోజు పురుషులు వేటకు బయలుదేరుతారు. వేటకు వెళ్లిన వారు ఏదైన జంతువుతో తిరిగి వచ్చే వరకు మహిళలు ఇంట్లో పనులు చేయరు. బయట పనులకు వెళ్లరు. ఉద్యోగస్తులుంటే మాత్రం గ్రామ కట్టుబాటు ప్రకారం జరిమానా చెల్లించి వెళ్లడానికి మినహాయింపు ఉంది. వేటకు వెళ్లిన వారు వచ్చేవరకు సమీప పట్టణాలకు వెళ్లి థింసా నృత్యాలు చేస్తూ సుంకం వసూలు చేస్తున్నారు. రహదారుల్లో కర్ర అడ్డం పెట్టి వాహనాలను నిలుపుతున్నారు. వాహనదారులు సంతోషంగా ఇచ్చిన సుంకం తీసుకుంటారు. వేటకు వెళ్లిన వారు సకాలంలో తమకు దొరికిన జంతువులో తిరిగి వస్తే దానిని అంతా సమానంగా పంచుకుంటారు. అలాగే సన్నిహితులకు, బంధువులకు నజరానాగా పంపిస్తారు.



గొనస పూజ నిర్వహిస్తున్న దృశ్యం



కర్రను అడ్డంగా పెట్టి సుంకం వసూలు చేస్తున్న గిరిజన మహిళలు

గిరిజన సంస్కృతికి ప్రతీక

ఇటుక పండుగ గిరిజన సంస్కృతికి ప్రతీక. ఈ పండుగ వల్ల తమ సంప్రదాయాలు, బాధ్యతలను తెలుసుకోవడానికి వీలుంటుంది. ఈ పండుగ పితృదేవతలకు, జీవన విధాన ఆచారాలకు సంబంధించినది.

- మజ్జి కన్నయ్య, కూనంబందవలస

ఎలా జీవించామో తెలిపే పండుగ

పూర్వం తమ పూర్వీకులు ఎలా జీవించారో తెలుపుతుంది. ప్రస్తుతం ఎలా జీవించాలో ఇందుకు అడవుల్లో సహజీవనం ఎలాగో ఈ పండుగ నేర్పుతుంది. జన్మనిచ్చిన పూర్వీకులను పూజించడం ప్రతిఒక్కరి బాధ్యత.

- తౌరిక లక్ష్మమ్మ, పణుకువలస

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

గుమ్మలక్ష్మీపురం: ఏపీ గిరిజన గురుకుల పాఠశాలల్లో ఐదు నుంచి 9వ తరగతి వరకు ఖాళీల భర్తీకి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురం ఏపీడబ్ల్యువో బి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏలో ఉన్న పలు గిరిజన గురుకుల పాఠశాలల్లో ఐదు నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీలకు ప్రవేశ పరీక్షలు నిర్వహించామని చెప్పారు. అయితే ఈ ప్రవేశ పరీక్షలకు 454 మంది దరఖాస్తులు చేసుకోగా 358 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షలకు ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ వర ప్రసాద్‌బాబు, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్ పర్యవేక్షకులుగా ఉన్నారన్నారు. ఈ పరీక్షల్లో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు చేపట్టామని తెలిపారు. మరికొద్ది రోజుల్లో ప్రవేశ పరీక్షకు నిర్వహించిన ఫలితాలు విడుదల చేస్తామన్నారు. ● **సీతంపేట:** స్థానిక బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరాజు తెలిపారు. ఆరో తరగతి ప్రవేశానికి 127 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టుకోగా 103 మంది హాజరయ్యారని చెప్పారు. 5వ తరగతిలో 145 మందికిగాను 118 మంది, ఏడో తర గతిలో 17 మందికిగాను 13 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. 8వ తరగతి 20మందికిగాను 15 మంది, 9వ తరగతి 11మంది విద్యార్థులకు పరీక్షకు హాజరయ్యారని వివరించారు. ఈ పరీక్షల్లో అధిక శాతం మార్కులు ఎవరు సాధిస్తారో వారికే హాస్టల్‌లో సీట్లు లభిస్తాయని ఆయన తెలిపారు.

'ఆదర్శ'లో ప్రవేశానికి..

భామిని: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి ఆదివారం పరీక్షలు నిర్వహించారు. 216 మంది దరఖాస్తు చేసుకోగా 194 మంది హాజరైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ తెలిపారు. పరీక్షల డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా వెంకటరావు వ్యవహరించారు. అధిక మార్కులు సాధించినవారికి కేటగిరీ పద్ధతిలో నియమిస్తామని చెప్పారు. ● **మక్కువ:** ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 185 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 157 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షను పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత, ఉపాధ్యాయ సిబ్బంది పరీక్షను పర్యవేక్షించారు.



మక్కువ: ఆదర్శ పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం



భామిని: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

చంద్రబాబు పర్యటన స్థల పరిశీలన

బొండపల్లి: విజయనగరం జిల్లాలోని బొండపల్లి మండలంలో ఈనెల 23న మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్నారు. ఈ మేరకు పర్యటన స్థలాన్ని బొబ్బిలి డీఎస్పీ బి.శ్రీనివాసరావు, గజపతినగరం సీఐ ఎన్‌వి.ప్రభాకర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ బీవీ నరసింహమూర్తి, ఎస్ఐ కదిరెడ్డి లక్ష్మణరావు ఆదివారం మధ్యాహ్నం పరిశీలించారు. సభా ప్రాంగణంలో ఎటువంటి భద్రతా లోపం లేకుండా ముందస్తు ప్రణాళికలతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎస్పీ సూచించారు. మంగళవారం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు సభ నిర్వహించే స్థలం వద్ద ప్రతిఒక్కరూ పోలీసు నిబంధనలు పాటించాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట పలువురు సిబ్బంది, అధికారులు ఉన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

ఈదురుగాలులతో వాన

● నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



దత్తిరాజేరులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మెంటాడ: మెంటాడ మండలంలో పలుచోట్ల ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. భారీ గాలులకు కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఒకట్రెండు చోట్ల చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ లైనుపై పడ్డాయి. దీంతో, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ● **దత్తిరాజేరు:** మండలంలోని ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి కోమటిపల్లి వద్ద, విందువాసి జంక్షన్ వద్ద విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపడుతున్నారు.

ఉచిత వేసవి సంగీత శిక్షణ శిబిరం

విజయనగరం రూరల్: నగరంలోని రోటరీ క్లబ్ విజయనగరం దశగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి వచ్చే నెల 3 వరకూ నగరంలోని లయన్స్ క్లబ్‌లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు అకాడమీ ప్రిన్సిపాల్ మండపాక రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ గాత్రం, ఇనుస్ట్రుమెంట్ వంటి వాటిపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. చిన్నారులు సంగీతం నేర్చుకుంటే, వారికి భాష పరిజ్ఞానం, జ్ఞాపకశక్తి, చదువుపై శ్రద్ధ, ఏకాగ్రత పెరుగుతాయని పేర్కొన్నారు. వయోలిన్, గిటారు, కీబోర్డు, మృదంగం, హార్మోనీయం వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వెంటనే సర్టిఫికేట్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9441042236 నెంబరును సంప్రదించాలని కోరారు.

దేవతా ఉత్సవాలకు సహకరించండి

● కళ్లికోటను సందర్శించిన ఏఎస్పీ సునీల్



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సునీల్

కొమరాడ: దేవత ఉత్సవాలు సజావుగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని ఏఎస్పీ సునీల్ కోరారు. కళ్లికోట గ్రామంలో సోమవారం నుంచి వేపాలమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో ఆయన ఆదివారం ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్థులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఉత్సవాలు సజావుగా సాగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ రవికుమార్, కొమరాడ ఎస్ఐ నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



బలిజిపేటలో వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

మక్కువ: స్థానిక మజ్జి గౌరమ్మ గుడి సమీపంలో సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పోలీసు సిబ్బంది ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. మక్కువలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. మద్యం, నగదు రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ● **బలిజిపేట:** స్థానిక సంతోట మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వాహనాల్లో ఎటువంటి ఆధారాలు లేకుండా నగదు, మద్యం తరలిస్తే సీజ్ చేస్తున్నామని స్థానిక ఎస్ఐ వి.పాపారావు తెలిపారు. ఈ తనిఖీల్లో సీనియర్ అసిస్టెంట్ పి.తిరుమలరావు, పోలీసు సిబ్బంది యు.సూరిబాబు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాజాం వారి భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు. విజయనగరం జిల్లా, తియ్యమ్మవలస మండలం, దాసరిపేట గ్రామ కాపురస్తురాలైన **శ్రీమతి ములగపాక పార్వతి W/o ఆదినారాయణ** నా క్లయింటు సంస్థ నుండి తీసుకొనబోవు ఋణమునకు హామీగా ఆమె స్వాధీన, హక్కు అనుభవములోనున్న ఈ దిగువ షెడ్యూలులో వివరించిన ఆస్తిని తాకట్టుగా పెట్టుటకు ప్రతిపాదించియున్నారు. కావున సదరాస్తిపై వేరే వ్యక్తికయినా ఎట్టి హక్కుగాని, ఆసక్తిగాని ఉన్న యెడల అట్టివారు ఈ నోటీసు ప్రచురింపబడిన ఏడు దినములలోగా వారి యొక్క ఆక్షేపణలను నాకుగాని, నా క్లయింటుకుగాని తెలియపరచవలెను. లేని యెడల సదరాస్తిపైగాని, దానిపై జరుపబోవు తాకట్టుపైగాని ఎవరికీ ఎట్టి అభ్యంతరములు లేవని భావింపబడునని యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది. **షెడ్యూలు:** విజయనగరం జిల్లా, కురుపాం మండలం, కురుపాం పరిధిలో గల శోభలతాదేవి కాలనీ వెనుకపై మరియు మోడల్ స్కూల్ దరిలో సర్వే నెం. 68-2 గల తూ.ప.లకు 50అ., ఉ.ద.లకు 24అ. మొత్తం 134చ.గ. గల విస్తీర్ణపు ఖాళీస్థలమునకు **హద్దులు: తూ:** పేట రోడ్డు, **ద:** నాతాలూకా ఖాళీస్థలం, **ప:** మోజంగి భాస్కరరావు, ఉప్పిసెట్టి రమణ గార్ల ఖాళీస్థలం, **ఉ:** నాతాలూకా ఖాళీస్థలం.

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759